





వానా వానా వెల్లువాయె...

- ఖమ్మం నగరంలో దంచికొట్టిన వర్షం...
- పలు ప్రాంతాల్లో జలమయమైన రహదారులు

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 22: నగరంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం అయ్యాయి. ఉదయంనుండి ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రం మబ్బులు కమ్మి, వర్షం పడింది. కాగా వర్షానికి ఇందిరానగర్, సిటీబస్టాండ్ వద్ద రహదారితో పాటు పలు రహదారులపై వరదనీరు ప్రవహించింది. సిటీబస్టాండ్ ఆవరణలో వర్షపునీరు నిలవటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాగా ఇటీవల మేజర్ మురుగుకాలువలను సిల్టుతీసి శుభ్రం చేయటంతో మయూరిసెంటర్ తదితర ప్రాంతాల్లో వరదనీరు ప్రవాహం తగ్గింది. గతంలో వర్షం పడితే మయూరిసెంటర్, కమాన్‌బజార్, కస్పాబజార్ తదితర ప్రధాన ప్రాంతాల్లో వరదనీరు మోకాళ్లలోతులో రహదారులపై ప్రవహించేది. కాలువలను శుభ్రం చేయటంతో కొన్ని ప్రాంతాల్లో రహదారులు మాత్రమే జలమయం అయి, రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది.

మారాలి.. మారాలి.. జీవనశైలి

గతి తప్పుతున్న ఆహారపు అలవాట్లు

- రోజు రోజుకూ పెరుగుతున్న కొలెస్ట్రాల్ బాధితులు
- నిత్యం వ్యాయామానికి దూరంగా ఉండటం చేతే...
- రక్తపోటు, మధుమేహం లాంటి వ్యాధులకు అవకాశం
- వెంటాడుతున్న స్థూలకాయం సమస్య
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు

మారిన జీవన శైలి.. ఆహారపు అలవాట్లు మనిషిని వ్యాధుల బారిన పడేస్తున్నాయి.. అవసరానికి మించి పెరిగిపోయిన సాంకేతిక పరిజ్ఞానం మనిషిని శారీరక శ్రమకు దూరం చేసి వ్యాధులకు దగ్గర చేస్తోంది. ఒకప్పుడు మధ్యవయస్సు దాటిన తరువాత కనిపించే బీపీ, షుగర్ వంటి వ్యాధులు నేడు యువకుల్లో కనిపిస్తున్నాయి. 30ఏళ్లకే అనేక మంది ఈ రకమైన జీవనశైలి వ్యాధులబారిన పడి నిండు జీవితాన్ని మధ్యలోనే ముగిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుత బిజీ ప్రపంచంలో సమతుల ఆహారానికి దూరమై నిత్యం జంక్‌ఫుడ్ తీసుకోవడంతో కొలెస్ట్రాల్ పెరిగిపోయి హార్ట్, బ్రెయిన్‌స్ట్రోక్ బాధితులు పెరిగిపోతున్నారు.

- ఖమ్మం కలెక్టరేట్

ప్రత్యేక కథనం : 7లో

భూముల విలువ పెంపునకు ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు కసరత్తు చేస్తున్నాయి. ఈ మేరకు తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లతో ఉమ్మడి సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందించారు. ప్రస్తుతం ఇరు జిల్లాల్లో రిజిస్ట్రేషన్లపై ఏటా రూ.250కోట్ల వరకు వస్తున్న ఆదాయం మరో రూ.100కోట్లు పెరిగి రూ.350 కోట్లకు చేరే అవకాశం ఉంది. ఈ నెల 29లోగా వ్యవసాయ భూములకు సంబంధించి ఆర్డీవో చైర్మన్‌గా ఉన్న కమిటీ రియల్ ఎస్టేట్ ప్లాట్లు, భూములకు సంబంధించి అర్బన్ ఏరియాలో భూములకు జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ అవసరమున్న చోట 20 నుంచి 50శాతంపైగా భూముల ధరలు పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదించాలి. జూలై 1న ఏ సర్వే నెంబర్‌లో ఎంత ధర పెరిగిందో వెబ్‌సైట్‌లో ఉంచాలి. దానిపై జూలై 15లోగా అభ్యంతరాలు స్వీకరించి, జూలై 20లోగా పరిష్కారం చేసి ఆగస్టు1 నుంచి పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది.



భూములకు ధరల బూమ్

- 50 శాతంపైగా ధర పెంచే అవకాశం
- 29 లోగా ఆమోదం.. ఆగస్టు 1న అమల్లోకి...
- ఉమ్మడి జిల్లాలో రూ.100 కోట్ల వరకు పెరగనున్న ఆదాయం

ఖమ్మం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వ్యవసాయ భూములకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో, వ్యవసాయేతర భూములు, ఆస్తులకు సంబంధించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. గ్రామాల్లో రూ.5 లక్షల వరకు ఉన్న భూమి విలువ రూ.10 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. ప్లాట్లకు సంబంధించి గజం రూ.2వేల ఉన్న విలువ రూ.4 వేలకు పైగా పెరిగే అవకాశం ఉంది. బహిరంగ మార్కెట్‌లో భూములు, ప్లాట్ల ధరలు అనుసరించి అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా వ్యవసాయభూములు, వ్యవసాయేతర భూముల విలువలు పెంచేందుకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు కసరత్తు చేస్తున్నాయి. దీంతో ఖమ్మం, ఖమ్మం రూరల్, కూసుమంచి, వైరా, మధిర, సత్తుపల్లి, కల్లూరు, కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఉన్న భూముల ధరలు అన్నీ పెంచి ఆగస్టు 1నుంచి పెరిగిన ధరల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేసి

విలువ పెంపునకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల కసరత్తు

ఆదాయాన్ని పెంచనున్నారు. భూములు ధరలు పెరుగుతున్నాయని కారణంతో పెండింగ్‌లోని రిజిస్ట్రేషన్లు, వచ్చే నెలలోపు చేయించుకునేందుకు రిజిస్ట్రేషన్‌దారులు, రియల్టర్లు ఆరాటపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏటా 50వేల పైగా రిజిస్ట్రేషన్లు చేస్తుండగా, ప్రభుత్వానికి రూ.250 కోట్లపైగా ఆదాయం లభిస్తోంది. కొత్తగా భూముల ధరలు పెరిగితే రూ.100నుంచి రూ.150కోట్ల వరకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఎకరం భూమి రూ.25లక్షల నుంచి రూ.50లక్షల వరకు ఉండగా ప్రభుత్వ లెక్కల ప్రకారం 5నుంచి రూ.10లక్షల వరకు మాత్రం విలువ ఉంది. ఇలా మార్కెట్ రేట్లకు రిజిస్ట్రేషన్ రేట్లకు తేడా ఉండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. భూముల ధరలు పెరిగితే ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే రైతులకు కూడా పెరిగిన భూముల ధరలతో రుణపరపతి పెరుగుతుందని, భూముల విలువ పెంపుతో వ్యవసాయ రుణాలతో పాటు విద్యారుణాలు తీసుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుతం భూమి విలువ రూ.లక్ష ఎకరానికి 20 నుంచి 30వేలు మాత్రమే రుణం ఇస్తున్నాయి. ఎకరం విలువ రూ.10లక్షలకు పెరిగితే రైతులు ఎకరానికి రూ.2లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉంటుంది. అయితే ఇప్పటికే కమర్షియల్‌గా గజం రూ.25 నుంచి 50వేల వరకు పెరిగి ఉన్న చోట మళ్లీ పెంచే ఆలోచన కనపడడంలేదు. గతంలో వాస్తవ ధరకంటే ఎక్కువ ధర నిర్ణయమైన చోట కూడా ఇప్పుడు తగ్గించుకునే అవకాశం కూడా కల్పించారు. మొత్తం మీద రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయాన్ని పెంచే దిశగా అటు వ్యవసాయ భూములు, ఇటు వ్యవసాయేతర భూముల విలువ పెంచేందుకు వేగంగా కసరత్తు జరుగుతోంది.

మిర్చి రైతులకు కుచ్చుటోపి

- వెయ్యి క్వింటాళ్లు కొనుగోలు చేసి పరారైన వ్యాపారి
- రూ.2 కోట్ల 20 లక్షలకు టోకరా
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ఎర్రుపాలెం జూన్ 22: ఆరుగాలం శ్రమించి పండించిన మిర్చి పంటకు మంచి ధర దక్కుతుందన్న ఆశతో అప్పగిస్తే.. డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు ఓ వ్యాపారి. ఎర్రుపాలెం మండలంలో ఈ ఘటన వెలుగుచూసింది. బాధిత రైతులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. దాదాపు రూ.2 కోట్ల 20 లక్షలు సదరు వ్యాపారి చెల్లించాల్సి ఉంది. వివరాల్లోకి వెళ్లితే... ఎర్రుపాలెం మండలం మొలుగుమాడు గ్రామానికి చెందిన ఖరీదు కృష్ణారావు అనే వ్యక్తి గత నాలుగేళ్లుగా మిర్చి వ్యాపారం చేస్తున్నాడు. రైతుల నుంచి మిర్చిని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయించే వాడు. అతడిని నమ్మిన 80 మంది రైతులు.. దాదాపు వెయ్యి క్వింటాళ్ల మిర్చిని అప్పగించారు. గుంటూరు మిర్చి యార్డ్‌లో మంచిధర పలుకుతోందని 15 రోజుల్లో పంటను అమ్మి డబ్బులు చెల్లిస్తానని నమ్మబలికాడు. అయితే నాలుగు నెలలు గడిచినా డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు నిలదీయడంతో.. వాయిదాలు పెడుతూ రోజులు గడుపుతున్నాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం రైతులు కృష్ణారావు ఇంటికి వెళ్లగా, అతడి తండ్రి అసభ్య పదజాలంతో దూషించాడు. శనివారం మళ్లీ వెళ్లి చూడగా ఇంటికి తాళం వేసి వుంది. దీంతో తాము మోసపోయామని గ్రహించి శనివారం మధిర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కృష్ణారావు నుంచి తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని వారు కోరారు.



హైదరాబాదులో తుది నివేదికను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం మార్కెట్‌కు మహర్దశ

- పునర్నిర్మాణానికి రూ.148.5కోట్లతో ప్రతిపాదనలు
- నిర్మాణ డిజైన్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

వివరాలు : 6లో



మూటాపురం సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రుణమాఫీని తట్టుకోలేక గగ్గోలు

- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు, ఆసరా పెన్షన్
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వివరాలు : 6లో

జూలూరుపాడు సొసైటీ అధ్యక్షుడిపై అనర్హత వేటు 6

అవినీతి పోలీసులకు చెక్

- పేకాట దందా వ్యవహారంలో సత్తుపల్లి రూరల్ సీఐ సస్పెన్షన్
- విలేకరిపై తప్పుడు కేసులో ఖమ్మం టూటౌన్ పూర్వ సీఐ కూడా..

సత్తుపల్లి/ఖమ్మం క్రైం, జూన్ 22: సత్తుపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న పేకాట, బెట్టింగ్ దందాల వ్యవహారంలో సత్తుపల్లి రూరల్ సీఐ వెంకటేశం సస్పెన్షన్‌కు గురయ్యారు. పెనుబల్లి మండలంలో పేకాట స్థావరంపై ఇటీవల పోలీసులు దాడి చేసి పట్టుకోవటం, పేకాట నిర్వహణకు స్థానిక అధికారి సహకారం ఉందని విచారణలో స్పష్టం కావటంతో అక్కడి సీఐని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నెలల తరబడి సత్తుపల్లి నియోజకవర్గంలలో పలు ప్రాంతాల్లో భారీ స్థాయిలో పేకాట నిర్వహిస్తున్నా పలు సందర్భాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు మాత్రమే దాడులు చేసి పట్టుకున్న సందర్భాలున్నాయే తప్ప స్థానిక పోలీసులు ఎప్పుడూ దీనిపై దృష్టి పెట్టలేదు. స్థానికంగా పేకాట నిర్వాహకులకు స్థానిక అధికారులకు ఉన్న సంబంధాలపై పలు సందర్భాల్లో బహిరంగంగానే విమర్శలు వచ్చాయి. దీనికి తోడు పేకాట నిర్వాహకులు, స్థావరాలపై కొద్ది రోజుల క్రితం వరకు భారీగా రాజకీయ దుమారం రేగిన విషయం విదితమే. పేకాట స్థావరాలను కొందరు వ్యాపార పద్ధతిలో నిర్వహిస్తుండగా వారికి కొందరు పోలీసుల అండదండలు కూడా తోడవటంతో మూడు ముక్కలు...ఆరు ఆటలుగా జోరుగా పేకాట సాగుతోందనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఒక ఇనస్పెక్టర్ స్థాయి అధికారిపై చర్యలు తీసుకోవడం చర్చనీయాంశమైంది.

ఖమ్మం టూటౌన్ పూర్వ సీఐ శ్రీధర్..

2022-23 మధ్యకాలంలో ఖమ్మం నగరంలోని టూటౌన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు



సీఐ వెంకటేశం



సి.హెచ్.శ్రీధర్

నిర్వహించిన సి.హెచ్.శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. నగరంలోని ఓ విలేకరి కేసు విషయంలో ఆయుధాల చట్టంతో పాటు పలు సెక్షన్లతో అతడిని బెదిరించి పంచనామాలో సంతకాలు చేయించి తప్పుడు కేసునమోదు చేశారని, అదేవిధంగా కేసును లేకుండా చేసి సివిల్ తగాదా పరిధిలోకి వస్తుందని కోర్టును తప్పుదోవ పట్టించినట్లుగా ఇన్‌స్పెక్టర్‌పై ఫిర్యాదు వచ్చింది. దీంతో ఖమ్మం సీపీ విచారణ నిర్వహించి ఇచ్చిన నివేదికలో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ అధికారాన్ని దుర్వినియోగం చేశారని రుజువు కావడంతో అతడిని సస్పెండ్ చేసినట్లు తెలిసింది. కాగా శ్రీధర్ ప్రస్తుతం ములుగు జిల్లాలో స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్నారు.



పలువురు పోలీసులకు సేవా పతకాలు

ఖమ్మం క్రైం, జూన్ 22: ఉత్తమ సేవలందించినందుకు జిల్లాలోని పలువురు పోలీసులకు సేవా పతకాలు దక్కాయి. ఈ మేరకు పోలీసు రాష్ట్రశాఖ నుండి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖమ్మం కమిషనరేట్‌కు చెందిన ఐటీకోర్ ఎస్ఐ పి.సత్యనారాయణకు ఉత్తమ సేవా పతకం లభించింది. అదేవిధంగా ఏసీపీ యు.సాంబరాజుకు , ఏఎస్ఐలు ఎన్.శ్రీనివసారావు, వి.వెంకటేశ్వర్లు, ఉమెన్ ఏఎస్ఐ సయ్యద్ సలీమాబేగం, ఏఆర్ఎస్ఐలు పి.కృష్ణయ్య, ఎస్‌కే యాకుబ్‌పాషా, బి.హరిబాబు, జి.వెంకటసుబ్బారావు, జి.సూర్యారావు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌లు ఏ.గోపి, బి. హనుమ, హెడ్‌కానిస్టేబుల్‌లు ఎండీ ఖాజామియా, కె.మోహన్‌రావు, కానిస్టేబుల్ కె.శ్రీనివాసరవుకు సేవాపతకాలు లభించాయి. ఈ పతకాలను ఆగస్టు 15న హైదరాబాదులో అందించనున్నారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణను ప్రతిఘటిస్తాం



- బీఆర్ఎస్ హయాంలోనూ ప్రైవేటీకరణ.. ఇప్పుడు రాజకీయ డ్రామా...
- కాంగ్రెస్ ప్రభుత్వం వేలాన్ని అడ్డుకోవాలి
- రైతులకు రూ.2లక్షల రుణమాఫీని స్వాగతిస్తున్నాం
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

వివరాలు : 6లో

గోదావరిలో మునిగి బాలుడి మృతి

- మరో ఇద్దరిని రక్షించిన స్థానికులు
- ప్రమాద స్థలాన్ని సందర్శించిన భద్రాద్రి కలెక్టర్



భద్రాచలం, జూన్ 22: భద్రాచలం వద్ద శనివారం గోదావరిలో మునిగి అంగులూరి కార్తీక్(11) అనే బాలుడు మృతిచెందాడు. ఏపీలోని అల్లూరి సీతారామ రాజు జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నంలోని శ్రీరామనగర్ కాలనీలో వివాహ వేడుకకు హాజరైన ఏపీలోని ఏలూరు మండలం మాదేపల్లి, ఖమ్మం నగరానికి చెందిన కుటుంబాల సభ్యుల్లోని పలువురు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో కత్తుల ఏడుకొండలు, బొజ్జా తాండవ కృష్ణ, కార్తీక్, మల్లికార్జున్, రాము నదిలో స్నానం చేసేందుకు దిగారు. ఈ క్రమంలో ఏడుకొండలు, తాండవ స్నానం ముగించుకొని ఒడ్డుకు చేరగా కార్తీక్, మల్లిఖార్జున్, రాము స్నానం చేస్తూ నది లోతును అంచనా వేయలేక నీటిలో మునిగిపోయారు. దీంతో వీరి అరుపులు విన్న గజ ఈతగాళ్లు నదిలోకి దిగి మల్లికార్జున్, రాములను ఒడ్డుకు చేర్చారు. గల్లంతైన కార్తీక్(11)కోసం గాలించగా మృతదేహం లభ్యమైంది. ప్రాణాలతో బయటపడ్డ మల్లికార్జున్‌కు భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలుస్తోంది. ఈ ఘటన విషయం తెలుసుకున్న భద్రాచలం ఎస్ఐ విజయలక్ష్మి అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్గానికి తరలించారు. బాధితుల నుంచి వివరాలు తెలుసుకొని కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పరిశీలించిన కలెక్టర్

భద్రాచలం వద్ద గోదావరి పరిసరాల్లో ఇకపై ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. నదిలో మునిగి బాలుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న కలెక్టర్ భద్రాచలం గోదావరి స్నాన ఘట్టాల వద్దకు చేరుకొని స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదావరి నది ఒడ్డున ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే నది లోతు గురించిన సమాచారం తెలిపేలా ప్రత్యేక సిబ్బందిని నియమించాలని సూచించారు.



శౌర్యపతకానికి ఎంపికైన సీఐ అశోక్

దుమ్ముగూడెం జూన్ 22: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ శౌర్యపతకానికి దుమ్ముగూడెం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొడ్డు అశోక్ ఎంపికయ్యారు. ధైర్యసాహసాలతోపాటు, ఆదర్శప్రాయంగా ఉద్యోగ విధులు నిర్వర్తించిన వారికి ఈ గుర్తింపు దక్కుతుంది. 2008లో ఎస్ఐగా విధుల్లో చేరిన అశోక్ గతంలో రెండు అవార్డులు దక్కించుకోగా ఇది మూడోది. 2019లో కఠినసేవా పతకం, 2021లో అంత్రిక్ సురక్షా సేవా పతకాలను పొందారు. శౌర్యపతకం అవార్డుతోపాటు నగదు రివార్డు కూడా దక్కనుంది. ఆగస్టు 15న ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డును స్వీకరించనున్నారు. ఎస్ఐలు పడాల కేశవరావు, పోటు గణేష్, ఏఎస్ఐ సత్యనారాయణ, పోలీస్‌స్టేషన్ సిబ్బంది సీఐకి అభినందనలు తెలిపారు. అలాగే దుమ్ముగూడెం ఏఎస్ఐ దాసరి సత్యనారాయణకు సేవాపతకం, కానిస్టేబుల్ బోడా నరేష్‌కు కఠిన సేవా పథకం లభించాయి.

సింగిల్ కౌంటర్ సిఫార్స్

- వినూత్నంగా ఫైల్స్ పంపుతున్న ఏజెంట్లు
- 1నుంచి 11వరకు ఖాళీగా కౌంటర్లు
- 12వ కౌంటర్‌కు తిరుగులేని గిరాకీ
- డీటీవో కార్యాలయంలో అమలు కానీ ఆల్ ఇన్ వన్ జీవో



ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 22: రవాణాశాఖలో పారదర్శకంగా పౌర సేవల్ని అందించేందుకు రాష్ట్ర రవాణా శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమగ్రంగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో గతంలో ఒక్కో కౌంటర్ ద్వారా ఒక్కో రకమైన దరఖాస్తులు పనులు చేపట్టారు. దీంతో అవినీతి ఆరోపణలు రావటంతో ఆల్ ఇన్ వన్ నినాదంతో ఏ కౌంటర్ నుంచైనా ఏ దరఖాస్తుదారులు ఏ పనులైన చేసేందుకు శాఖాపరంగా జీవోను విడుదల చేశారు.ఆ మేరకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లో మార్పులు చేశారు. దీంతో రవాణాశాఖ కార్యాలయానికి వెళ్లిన దరఖాస్తుదారుడు ఏ కౌంటర్ వద్దకు వెళ్లైనా ఏ పనులైన పారదర్శకంగా చేయించుకునేందుకు రవాణాశాఖ అవకాశం కల్పించింది.

12వ కౌంటర్‌కే గిరాకీ

ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో 1 నుంచి 11 వరకు ఒకే వరసలో రవాణాశాఖ కౌంటర్లు ఏర్పాటు చేశారు. 12వ కౌంటర్ మాత్రం మరో వైపు రెండు వైపుల (ముందు, వెనుక) తలుపులతో ప్రత్యేకంగా ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ కార్యాలయాలపై వరసగా అవినీతి నిరోధకశాఖ దాడులు జరపటంతో ఖమ్మం డీటీవో కార్యాలయం లోనికి ఏజెంట్లను అనుమతించటం లేదు. దీంతో ఏజెంట్లు వినూత్నంగా ఆలోచించి వారి వద్దకు వచ్చే వాహన దరఖాస్తుదారుల పనులు చేసేందుకు ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసి 12వ కౌంటర్‌కు వెళ్తేనే పని జరుగుతుందని చెపుతున్నారు. దీంతో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు 12వ కౌంటర్ వద్ద దరఖాస్తుదారులు క్యూ కడుతున్నారు. గంటల తరబడి నిల్చోని పనులు చేయించుకొని వెళ్తున్నారు. కానీ 1 నుంచి 11వరకు కౌంటర్లు ఖాళీగా ఉంటున్నా అక్కడకు వెళ్లటం లేదు. కార్యాలయంలో అడుగడుగున సీసీ కెమెరాలు ఉన్నా ఒకే కౌంటర్ నుంచి ఎక్కువ ఎందుకు క్యూ ఉంటున్నారే విషయంపై అధికారులు సరైన దృష్టి పెట్టడం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. ఈ విషయంపై జిల్లా రవాణాశాఖ అధికారి ఆఫ్రీన్‌సిద్ధిఖ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా సీనియర్ ఉద్యోగికి అనుభవం ఎక్కువగా ఉండటంతో ఎక్కువ ఫైల్స్ ఒకే కౌంటర్ నుంచి వస్తున్నాయన్నారు. తప్పుడు ధ్రువపత్రాలతో రవాణాశాఖ పనులు జరిగితే ఆయా పనులు చేసిన ఉద్యోగులే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

పండితాపురం సంత వేలంపాట మరోసారి వాయిదా

- ప్రభుత్వ ధర రూ.కోటి 84లక్షల 70వేలు
- పాటదారులు అంత ధర పాట పాడకపోవడంతో వాయిదా

కామేపల్లి, జూన్ 22: పండితాపురం శ్రీకృష్ణ ప్రసాద్ పశువుల సంత మరోసారి శనివారం వాయిదా పడింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.కోటి 84లక్షల70వేల746 ప్రకటించారు. డీఎల్పీవో ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో సంత ప్రాంగణంలో సంత వేలం పాట నిర్వహించారు. గుత్తేదారులు బానోత్ వీరన్న, దారావత్ శంకర్, బోడ శ్రీనులు ధరావత్తు సొమ్ము రూ 30లక్షలు, సాల్వెన్సీ సొమ్ము రూ.5లక్షలు చెల్లించి పాటలో పాల్గొన్నారు. తొలుత బానోత్ వీరన్న రూ.10వేలతో పాట మొదలు పెట్టారు. చివరకు రూ.కోటి 30లక్షలు వరకు పాట పాడి ఆగిపోయారు. మద్దతు ధర రాకపోవడంతో అధికారులు సంత వేలం పాటను రద్దు చేసి మరో రోజుకు వాయిదా వేశారు. సంత నిర్వహణ భారంగా ఉందని అధిక రేటుకు పాడి నష్టపోతున్నామని గుత్తేదారులు ముగ్గురు సిండికేట్ అయి వేలంలో అంతకంటే ఎక్కువగా పాడడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలతో మరోరోజు సంత వేలం పాట నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈవేలంలో ఎంపీడీవో రవీందర్, ఎంపీలో జీవి సత్యనారాయణ, రాజారావు, పంచాయతీ కార్యదర్శి గుగులోత్ నెహ్రూ, పెంద్ర అనిల్, భాస్కర్, రాజేస్ తదితరులు ఉన్నారు. సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ ప్రవీన్‌కుమార్ భారీ బందోబస్తు నిర్వహించారు.



ధ్రువపత్రాల వెరిఫికేషన్ ప్రోగ్రెస్‌ను అందజేస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్

పాలీసెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

జిల్లా కో-ఆర్డినేటర్ నాగముని నాయక్

చుంచుపల్లి, జూన్ 22: పాలీసెట్-2024 కౌన్సిలింగ్ ప్రక్రియలో ధ్రువపత్రాల పరిశీలన శనివారం చేపట్టారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థులకు వెరిఫికేషన్ ప్రోగ్రెస్ జిల్లా పాలీసెట్ కో-ఆర్డినేటర్ నాగమునినాయక్ అభ్యర్థులకు అందజేశారు. ఈనెల 25వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుందని ఆయన తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తి అయిన అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవాలని, ఈ నెల 27 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. తొలిరోజు మొత్తం 340మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనట్లు వివరాలు వెల్లడించారు.



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

జమలాపురం వెంకన్నకు సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం, జూన్ 22: జమలాపురం ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. శనివారం సందర్భంగా స్వామివారు ప్రత్యేక ముత్యాల కవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకిలో ఊరేగించి కల్యాణ వేదికవద్దకు చేర్చి నిత్యకల్యాణం నిర్వహించారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. ఆలయ సిబ్బంది శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఉచిత అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.విజయకుమారి, జూనియర్ అసిస్టెంట్ కృష్ణప్రసాద్, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది సాయి, వంశీ, మారుతిరావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధితుల పరిహారంపై సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 22: కోదాడ-కురవి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసితులకు పరిహారం చెల్లింపుపై జాతీయ రహదారుల అధికారులతో శనివారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన కోదాడ-ఖమ్మం మార్గ మధ్యలో నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామ సమీపంలో గంగమ్మ దేవాలయం, ఆర్చి, డ్రెయిన్లు, ఇళ్లస్థలాలు కోల్పోయిన బాధితుల పరిస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా దేవాలయానికి పరిహారాన్ని చెల్లించే విషయమై చర్చించారు. మండల తహసీల్దారు ద్వారా దీనికి పరిష్కారాన్ని చూపనున్నట్లు తెలిపారు. ఇళ్లస్థలాలు కోల్పోయిన బాధితులకు పరిహారాన్ని అందించాలని దరఖాస్తులు అందడంతో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు ఎంతమేరకు భూమి పోయింది. బాధితులు ఎంత నష్టపోయారు అనే అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్ పీడీ పద్మ, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

'ఒలింపిక్ డే' రన్ రద్దు

ఖమ్మం స్పోర్ట్స్, జూన్ 22: జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించ తలపెట్టిన 'ఒలింపిక్ డే' రన్‌ను రద్దు చేస్తున్నట్లు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి క్రిష్టపర్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ (శాట్స్) నుంచి రన్ నిర్వహణపై ఎటువంటి ఆదేశాలు రానందున ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రతిష్టాత్మక 'ఒలింపిక్ డే' రన్‌ను జరుపుకోవట్లేదని తెలిపారు. అంతే కాకుండా ఒలింపిక్ డే రన్‌ను రాష్ట్రంలోని ఏ జిల్లాలో కూడా నిర్వహించట్లేదని ఆయన తెలిపారు. కావున క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు రన్ రద్దు విషయాన్ని గ్రహించాలని కోరారు.

భద్రాద్రి రామయ్యకు జ్యేష్ఠాభిషేకం

- పంచామృతాలతో ప్రత్యేక స్నపనం
- నేటినుంచి నిత్య కల్యాణాల పునరుద్ధరణ



పూజలు నిర్వహిస్తున్న వైదిక సిబ్బంది

భద్రాచలం, జూన్ 22: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్యేష్ఠాభిషేక మహోత్సవాల్లో భాగంగా భద్రాద్రి రామయ్యకు శనివారం సంప్రదాయబద్ధంగా జ్యేష్ఠాభిషేకాన్ని నిర్వహించారు. జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రతి ఏటా దేవస్థానం ఆధ్వర్యంలో జ్యేష్ఠాభిషేక మహోత్సవాలను నిర్వహించడం ఇక్కడి సంప్రదాయం. ఈ సందర్భంగా నిత్య కల్యాణమండప వేదిక వద్దకు ఉత్సవమూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి ప్రత్యేక వేదికపై ఆసీనులను చేశారు. అనంతరం 81కలశాలలో ఉన్న నదీ జలాలతో స్వామివారికి అభిషేకాన్ని నిర్వహించారు. ఈ సమయంలో పంచామృతాలతో ప్రత్యేక స్నపనం నిర్వహించగా చివరగా సహస్రధారతో స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాద నివేదన చేశారు. అలాగే జ్యేష్ఠాభిషేక హోమానికి పూర్ణాహుతి చేశారు. జ్యేష్ఠాభిషేక మహోత్సవాలకు శుక్రవారం రాత్రి అంకురార్పణ చేయగా అర్చక స్వాములకు దీక్షా వస్త్రాలను అందజేశారు. దీంతో రెండు రోజుల పాటు నిర్వహించిన జ్యేష్ఠాభిషేక మహోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. కార్యక్రమంలో స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ముఖ్య అర్చకులు కోటి విష్ణువర్ధనాచార్యులు, పొడిచేటి రామభద్రాచార్యులు, వైదిక, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం స్వామివారి నిత్యకల్యాణాన్ని పునరుద్ధరించనున్నారు.

జూలూరుపాడు సొసైటీ అధ్యక్షుడిపై అనర్హత వేటు

- ఎరువుల దుకాణం కలిగి ఉండడంపై హైకోర్టులో కేసు
- అనర్హుడిగా ప్రకటిస్తూ కోర్టు తీర్పు
- కొత్త అధ్యక్షుడిగా వైస్‌చైర్మన్ భిక్షానికి బాధ్యతలు



వివరాలను వెల్లడిస్తున్న సీఈవో రమణరెడ్డి

జూలూరుపాడు, జూన్ 22: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జూలూరుపాడు సొసైటీ అధ్యక్షుడు లేళ్ల వెంకటరెడ్డిని అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో అతడి అతడి స్థానంలో వైస్ చైర్మన్‌గా ఉన్న చీమలపాటి భిక్షానికి అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తూ భద్రాద్రి జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ ఉత్తర్వులు జారీ చేశారని జూలూరుపాడు సొసైటీ సీఈవో రమణరెడ్డి తెలిపారు. 10మంది డైరెక్టర్ల సమక్షంలో శనివారం చీమలపాటి భిక్షం అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఈవో వివరాలను వెల్లడించారు. ఇప్పటి వరకు జూలూరుపాడు సొసైటి అధ్యక్షుడిగా కొనసాగిన లేళ్ల వెంకటరెడ్డి సొసైటీ ఎన్నికల్లో పోటీచేసే సమయానికి అతడి పేరుపై ఎరువుల దుకాణం లైసెన్స్ కలిగి ఉన్నాడని, అతడు డైరెక్టర్, చైర్మన్ పదవికి అనర్హుడని ఇదే సొసైటీకి చెందిన డైరెక్టర్ యల్లంకి సత్యనారయణ 2020 మార్చిలో వరంగల్ ట్రిబ్యూనల్ కోర్టులో పిటిషన్ వేశారు. విచారణ నిర్వహించిన కోర్టు 2023 ఆగస్టు 7న వెంకటరెడ్డిని అనర్హుడిగా ప్రకటించింది.

అయితే వెంకటరెడ్డి వరంగల్ ట్రిబ్యూనల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ విచారణ నిర్వహించిన అనంతరం హైకోర్టు జూన్ 18న లేళ్ల వెంకటరెడ్డి సొసైటీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్ పదవికి అనర్హుడని ప్రకటిస్తూ తీర్పునిచ్చింది. దీంతో భద్రాద్రి జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు చీమలపాటి భిక్షాన్ని అధ్యక్షుడిగా నియమించినట్లు సొసైటీ సీఈవో తెలిపారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన భిక్షాన్ని సొసైటీ డైరెక్టర్లు సన్మానించారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు యల్లంకి సత్యనారయణ, కొమ్మినేని పాండురంగారావు, చాపలమడుగు రాంమ్మూర్తి, హేమ్లా, జవహర్‌లాల్, రాము, తిరువెంగళరాజు, వెంకయ్య, రజని తదితరులున్నారు.

మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కంభంపాటి



ఖమ్మం కలెక్టరేట్, జూన్ 22: మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కంభంపాటి నారాయణ రావు ఎన్నికయ్యారు. శనివారం నిజామాబాద్‌లో జరిగిన 10వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారి ఎన్నిక నిర్వహించారు. ఇప్పటి వరకు ఏకగ్రీవంకాగా మొదటి సారిగా ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సమీప ప్రత్యర్థి కన్నా 60ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. డాక్టర్ నారాయణరావు ప్రస్తుతం ఖమ్మం మానసిక వైద్యుల సంఘం సెక్రటరీగా, ఖమ్మం జిల్లా ఐఎంఏ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. డాక్టర్ నారాయణరావు ఎన్నికవ్వడం పట్ల ఖమ్మానికి చెందిన పలువురు ప్రముఖులు, మానసిక వైద్యులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రుణమాఫీని తట్టుకోలేక ప్రతిపక్షం గగ్గోలు

● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న నాయకులు

నేలకొండపల్లి, జూన్ 22: ఇచ్చినమాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రైతు రుణమాఫీని చూసి ప్రతిపక్షం సొల్లు కబుర్లు చెబుతూ గగ్గోలు పెడుతోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నేలకొండపల్లి మండలంలో శనివారం ఆయన మంత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీకి అవసరమైన అన్ని సమకూర్చుకున్నామన్నారు. రైతన్నల ముఖాల్లో ఆనందం చూడాలనే లక్ష్యంతో జులై నుంచి రుణమాఫీ కార్యక్రమం ప్రారంభిస్తాన్నారు. రూ.31వేల కోట్లతో అందరికీ రుణమాఫీ చేస్తామన్నారు. రుణమాఫీ చేయలేమని ప్రతిపక్షం ఎన్నో అవాకులు, చెవాకులు పేలిందని, ఇప్పటికైనా ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడటం మంచిదన్నారు. ప్రజలు కోరితెచ్చుకున్న ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేర్చుతామన్నారు. పేదోడికిచ్చేందుకు ఎట్టి పరిస్థితుల్లో వెనుకాడేదే లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

ఇళ్లు, ఇళ్ల స్థలాలిచ్చే మంత్రిని తానే కాబట్టి పాలేరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇచ్చి తీరుతానన్నారు. తమ గ్రామంలో లిఫ్టులకు మరమ్మతులు చేయించాలని, విద్యుత్ అధికారులు పని చేయటం లేదని మూటాపురం గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా మండలంలో అన్ని సమస్యలు ఉన్న అన్ని లిఫ్టులకు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ ఏఈఈ అందుబాటులో ఉండటం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని మూటాపురంలో గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, దీనిపై ఏఈఈని సమాధానం చెప్పాలని మంత్రి ఆదేశించగా ఏఈఈ అందుబాటులో లేకపోవటంతో వెంటనే ఆయనను సెలవుపెట్టి వెళ్లిపోవాలని ఆదేశించారు. ప్రజలను ఇబ్బందులు పెట్టే అధికారులకు బదిలీలు ఉండవని, తీసివేయమే ఉంటుందని హెచ్చరించారు.

అర్హత ఉన్న ప్రతి వారికి రేషన్‌కార్డు, ఆసరా పెన్షన్ ఇస్తామన్నారు. అర్హత లేనివారు తమ కార్డులు, పింఛన్లను వదులుకోవాలన్నారు. పథకాలకు అర్హులు కానివారు ప్రభుత్వం నుంచి వేరే సహాయం తీసుకోవాలన్నారు. తాను సభల్లో ఇస్తున్న హామీలను సంబంధిత అధికారులు వెంటనే అమలు చేయాలని మంత్రి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. రాజేశ్వరపురం గ్రామంలో లబ్ధిదారులకు కల్యాలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు బాగం హేమంతరావు, ఎంపీపీ వజ్జా రమ్య, నాయకులు నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేష్, వేగినాటి లక్ష్మీనర్సయ్య, వెన్నపూసల సీతారాములు, గుడిమళ్ల మధు, బెల్లం వాసు, షేక్.ఖాజామియా, కట్టికోల సుధాకర్, బొడ్డు బొందయ్య, కొర్లకుంట నాగేశ్వరరావు, బచ్చలకూరి నాగరాజు, వడ్డె జగన్, గండు జానయ్య, జంగం లక్ష్మీనారాయణ, మామిడి వెంకన్న కుక్కల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌కు మహర్దశ

- రూ.148.5కోట్లతో ప్రతిపాదనలు
- నిర్మాణ డిజైన్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం,జూన్22(ఆంధ్రజ్యోతిప్రతినిధి): అంతర్జాతీయ ప్రమాణాలతో ఖమ్మం వ్యవసాయమార్కెట్‌ను పునర్‌నిర్మించేందుకు రూ.148.5కోట్లతో చేపట్టిన ప్రతిపాదనల నివేదికను శనివారం ప్రభుత్వ ఆమోదానికి పంపించారు. కొత్త మార్కెట్ ప్రతిపాదనలను డిజైన్లను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాదులో అధికారులతో కలిసి పరిశీలించారు. సాంకేతికపరమైన కొన్ని మార్పులతో మంత్రి తుమ్మల ఆదేశాలను అనుసరించి తుది నివేదిక సిద్ధం చేసిప్రతిపాదనలు ప్రభుత్వానికి అందించారు. ఖమ్మంల మిర్చి, పత్తితోపాటు అపరాల కొనుగోలుకు వ్యవసాయమార్కెట్ ఏర్పాటయింది. ఆంధ్రా, ఏపీ నడుమ ఖమ్మం వ్యవసాయమార్కెట్ ఉండడంతో ఖమ్మం జిల్లా నంచే కాకుండా పొరుగున ఉన్న ఏపీ జిల్లాలు, తెలంగాణసరిహద్దు జిల్లాల నుండి పలురకాల ఉత్పత్తులు తెచ్చి అమ్మడం జరుగుతుంది. మిర్చి సీజన్‌లో రోజుకు లక్షకు పైగా మిర్చి బస్తాలు రావడంతో మిర్చి మార్కెట్‌లో సౌకర్యాల సమస్య ఉంది. పత్తి,మిర్చి యార్డుల్లో పెద్దఎత్తున బస్తాలు రావడం వల్ల వాహనాలు , ఆటోలు, వ్యాన్లు, లారీలన్నీ రోడ్లపైనిలిపివేస్తూ ట్రాఫిక్‌కుఅంతరాయం కలిగిస్తుంది. రైతులు కూడా పం టను అమ్ముకోవడానికి చాలా సమయం పాటు వేచి ఉం డాల్సి వస్తుంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పునర్‌నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా 145కోట్ల అంచనాతో నివేదిక సిద్ధం చేసి శనివారం ప్రభుత్వానికి పంపించారు.

ఆయిల్‌పామ్ కనీస మద్దతు ధర రూ.15వేలు ఉండాలి

● కేంద్రానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి

ఖమ్మం, జూన్ 22(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఆయిల్‌పామ్ పంటకు కనీస హామీ ధరగా టన్నుకు రూ.15వేలుగా నిర్ణయించాలని, క్రూడ్‌పామాయిల్ ధర టన్నుకు రూ.లక్ష ఉండేలా చూడాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా శనివారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఖమ్మంలోని తుమ్మల క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఆయిల్‌పామ్‌ను రైతులకు లాభసాటిగా చేసి ప్రోత్సహించాలని కోరారు. ఆయిల్‌పామ్‌పై దిగుమతి సుంకాన్ని విధించి దేశంలో ఆయిల్‌పామ్ రైతులను ప్రోత్సహించాలని కోరారు. దేశంలో సాగును పెంచాలని కోరారు. వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి కేంద్ర ప్రభుత్వం 1992 నుంచి ప్రోత్సాహకాలు ఇస్తుండడంతో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తోందని తుమ్మల తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోందన్నారు. రాష్ట్రంలో 31 జిల్లాల్లో ఆయిల్‌పామ్ విస్తరణ కార్యక్రమం చేపట్టామని, 14 కంపనీలకు అనుమతులు ఇచ్చామని, ఆయిల్‌పామ్ మొక్కలు పెంపకం కోసం ఆయా కంపెనీల ద్వారా 44 నర్సరీలు ఏర్పాటు చేశామని మంత్రి కేంద్రానికి తెలిపారు. రాష్ట్రంలో పెరిగిన పంట మార్పిడి ఆవశ్యకత దృష్ట్యా తెలంగాణలో పెద్దఎత్తున ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందన్నారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్‌కు టన్నుకు రూ.13,438లు ధర ఉందని, అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గుతున్న ఆయిల్ ధరలు పంట దిగుమతుల సుంకంపై కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రైతులకు నిరాశ కలిగిస్తున్నాయన్నారు. కనీస మద్దతు ధర రూ.15వేలు నిర్ణయించి రాబోయే ఐదేళ్ల పాటు అమల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల కేంద్రాన్ని కోరారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణను ప్రతిఘటిస్తాం

- బీఆర్ఎస్ హయాంలోనూ ప్రైవేటీకరణ.. ఇప్పుడు రాజకీయ డ్రామా...
- కాంగ్రెస్ ప్రభుత్వం వేలాన్ని అడ్డుకోవాలి
- రైతులకు రూ.2లక్షల రుణమాఫీని స్వాగతిస్తున్నాం
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 22: మేకింగ్ ఇన్ ఇండియా నినాదంతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఉన్న జాతీయ సంపద అయిన బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేస్తూ కార్పొరేట్‌శక్తులకు కొమ్ముకాస్తోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో బొగ్గు బావుల ప్రవేటీకరణకు పరోక్షంగా సహకరించిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం నిరసనలు ప్రకటిస్తోందని విమర్శించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవుల అశోక్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటు రంగారావు మాట్లాడుతూ దేశంలో 500 బొగ్గుగని బ్లాక్‌లుండగా వాటిలో 300 బ్లాక్‌లను బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసిందన్నారు. గత రెండు రోజులుగా మరో 60బ్లాక్‌లను ప్రైవేటీకరణ వేలానికి సిద్ధం చేశారని విమర్శించారు. దేశంలో ఉన్న సహజ వనరులను కార్పొరేట్‌శక్తులకు కట్టబెట్టి దేశ ద్రోహం చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా నుంచి భద్రాద్రి జిల్లా వరకు వేలాది మంది కార్మికులకు బొగ్గు గనులు ఉద్యోగాలు, ఉపాధి కల్పించి ప్రభుత్వాలకు రూ.లక్షల కోట్ల సంపద ఆదాయాన్ని అందించాయని వివరించారు. ఒకప్పుడు సింగరేణిలో 1,50,000 ఉద్యోగులుండగా ప్రభుత్వ విధానాల కారణంగా ప్రస్తుతం 40వేల ఉద్యోగులే ఉన్నారన్నారు. వారి భవిష్యత్‌ను కూడా ప్రశ్నార్థకం చేసేలా కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ దిశగా ముందుకెళుతోందన్నారు.

సింగరేణి సంస్థ టీఎస్‌పీసీ సంస్థకు విద్యుత్ ఉత్పత్తికి టన్ను బొగ్గును రూ.3,500నుంచి రూ.4వేలకు అమ్మకాలు చేస్తోందని, దీని ద్వారా విద్యుత్ ఉత్పత్తిపై భారం తగ్గిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోయగూడెం, సత్తుపల్లి, రామగుండం బ్లాక్‌లను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తే ఎటువంటి అడ్డు చెప్పలేదని గుర్తు చేశారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో మరోమూడు బ్లాక్‌లు ప్రైవేటీకరణ వేలంలో పెట్టారని పోటు రంగారావు ఆరోపించారు. ఇలా చేస్తూ పోతే మరో పదేళ్లలో సింగరేణీ సంస్థ కనుమరుగవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వినతులకే పరిమితం కాకుండా బొగ్గు బావుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ప్రకటనను మాస్‌లైన్ పార్టీ స్వాగతిస్తోందన్నారు. జాతీయ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విఫలమైందన్నారు. నీట్ పరీక్షలు పేపరు లీకేజీకి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు గుర్రం అచ్చయ్య, జీ రామయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు, బండెల వెంకయ్య, సీవై పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు గ్రాట్యూటీ చెల్లించాలి

» కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి గాంధీ పథం సభ్యుల వినతి



కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న గాంధీపథం ప్రతినిధి బృందం

కొత్తగూడెం టౌన్, జూన్ 22 : సింగరేణి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గ్రాట్యూటీని చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్రబొగ్గుగనుల శాఖామంత్రి కిషన్ రెడ్డికి గాంధీ పథం ప్రతినిధి బృందం శనివారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాంధీపథం అధ్యక్షుడు చింతలచెర్వు గెర్షోం మాట్లాడుతూ 2017 నుంచి సింగరేణి రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యూటీని చెల్లించకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే గ్రాట్యూటీని చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కేంద్రమంత్రిని కోరారు. కార్మికులకు సంబంధించిన గ్రాట్యూటీ చెల్లించే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని, కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

భద్రాచలం ఇన్‌చార్జి ఈవోగా శ్రీకాంతరావు

భద్రాచలం, జూన్ 22: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పది రోజుల వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఈ మేరకు దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.జ్యోతి నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈవో రమాదేవి తిరిగి జూలై ఒకటిన విధుల్లో చేరనున్నారు. పది రోజుల పాటు దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయ శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంతరావు వ్యవహరించనున్నారు.

ప్రారంభమైన పాలిసెట్ కౌన్సిలింగ్

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 22: టీజీ పాలిసెట్ 2024 ప్రవేశాల కౌన్సిలింగ్ శనివారం నుంచి నగరంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 వరకు ఈ కౌన్సిలింగ్ జరుగుతుందని తెలిపారు. మొదటి రోజు 320 మంది విద్యార్థులకు గాను 318 మంది కౌన్సిలింగ్‌కు హాజరైనట్లు కోఆర్డినేటర్ ఎం సుబ్రమణ్యం తెలిపారు. ఈ నెల 27 వరకు వెబ్ ఆప్షన్స్, 30న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

ఐఐటీ బాంబేలో సీటు సాధించిన గిరిజన యువతి



నవ్య

కూసుమంచి, జూన్ 22: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గంగబండతండాకు చెందిన బాణోతు మోతీలాల్, సరోజ దంపతుల కుమార్తె నవ్య ఇటీవల జరిగిన ఐఐటీ మెయిన్స్‌లోనూ, అడ్వాన్స్ పరీక్షల్లోనూ మంచి మార్కులతో బాంబే ఐఐటీ కళాశాలలో అర్హత సాధించింది. కాగా నవ్య గంగబండతండాలో ప్రాథమిక విద్య, కూసుమంచి ఉన్నత పాఠశాలలో ఉన్నత విద్య పూర్తి చేసుకుంది. టెన్త్‌లో 9.5 గ్రేడ్ పాయింట్లు సాధించింది. సీవోఈ (సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్) ఎంట్రెన్స్‌లో ప్రతిభ కనబర్చడంతో వికారబాద్‌లోని పరిగి ఇంటర్ కళాశాలలో సీటు సాధించింది. ఎంపీసీలో వెయ్యి మార్కులకు 964 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చింది. ఇటీవల ఐఐటీ ఎంట్రెన్స్‌లోనూ అత్యధిక మార్కులు సాధించి బాంబే ఐఐటీ కళాశాలలో సీటు సాధించి పలువురి మన్ననలు పొందింది. ప్రస్తుతం మెటల్లాజికల్ ఇంజనీరింగ్‌లో సీటు కన్‌ఫాం అయింది. అయితే కౌన్సిలింగ్‌కు అవకాశం ఉండటంతో సీఎస్ఈ, మెకానికల్, బ్రాంచ్‌లో సీటు లభిస్తుందని ఎదురుచూస్తోంది. కాగా నవ్య తండ్రి చిన్న పాటి ప్రవేట్ ఉద్యోగం చేస్తుండగా, తల్లి వ్యవసాయ కూలీగా పని చేస్తుంది. నాలుగేళ్లకు గాను సుమారు రూ.6 లక్షల వరకు ఖర్చువుతుందని, ఇంత భారం మోసే పరిస్థితి లేదని వాపోయారు. ఆర్థికంగా ఎవరైనా ఆదుకోవాలని (ఫోన్ పే 9666 366 011) విజ్ఞప్తిచేశారు.

కలెక్టర్ కావడమే లక్ష్యం: నవ్య

తల్లితండ్రులకు ఫీజులు కట్టేస్థోమత లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివాను. కలెక్టర్ కావడమే తన లక్ష్యమని, పేద ప్రజలకు సేవ చేయడం అంటే తనకు ఇష్టమని వివరించింది.

పాఠశాల ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

ములకలపల్లి, జూన్ 22 : ములకలపల్లి మండలం రాజీవ్‌నగర్‌కాలనీలో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు పత్తిపాటి వీరయ్యను జిల్లా విద్యాశాఖాధికారి శనివారం సస్పెండ్ చేశారు. సదరు ఉపాధ్యాయుడు శుక్రవారం మద్యం మత్తులో పాఠశాల విధులకు హాజరైనందుకు గాను, విధుల్లో అలసత్వం వహించడంపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వీరయ్యను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పొలం దారి వివాదంలో

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

» ఇరువురికి గాయాలు » సింగరాయపాలెంలో ఉద్రిక్తత



దాడి వివరాలను సేకరిస్తున్న సీఐ సాగర్

కొణిజర్ల, జూన్22: రెండు కుటుంబాల మధ్య పొలంలో నడిచేదారి విషయంలో జరుగుతున్న ఘర్షణల్లో ఒక కుటుంబంలోని సభ్యులు, మరో కుటుం బ సభ్యులపై దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం..

గ్రామంలోని కంకణాల శ్రీనుకు, బొల్లెపోగు వెంకటి మధ్య పొలాల వద్ద నడిచేదారి విషయంలో కొద్ది రోజులుగా ఘర్షణ జరుగుతోంది. దారితో పాటు శ్రీను వరదనీరు కోసం కందకం తీస్తుండగా అక్కడ వారి మధ్య ఇటీవల గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో శ్రీను, అతని కుమారుడు అవినాష్ ఇద్దరు జరిగిన విషయాన్ని కాలనీలోని ఓ పెద్దతో చెప్పేందుకు వెళ్లారు. అక్కడ నుంచి ఇద్దరు ఇంటికి వస్తుండగా, బొల్లెపోగు వెంకటి, అతడి కుమారుడు వంశీలు గొడ్డలి, ఇనుపరాడ్లు, కారంతో వారిని అడ్డగించి దాడి చేశారు. ఈ దాడిలో శ్రీను, అవినాష్‌లకు గాయాలయ్యాయి. రాత్రిపూట ఈ దాడితో గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న వైరా సీఐ సాగర్, ఎస్ఐ శంకర్‌రావు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. జరిగిన విషయాన్ని సీఐ గ్రామస్థుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారిని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధవులు మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన కంకణాల శ్రీను సోదరుడు కంకణాల వెంకటకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొల్లెపోగు వెంకటి, వంశీలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

ఆగిఉన్న ట్రాక్టర్‌కు తగిలి వృద్ధురాలు మృతి



ముత్యం మృతదేహం

చంద్రుగొండ, జూన్ 22: ఆగిఉన్న ట్రాక్టర్‌కు తగిలి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తుంగారంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి అప్పికుంట్ల ముత్యం (70) కొన్నేళ్లుగా కంటి చూపు మందగించింది. ఈక్రమంలో గ్రామంలో మరో వీధిలో నివాసం ఉంటున్న కొడుకు ఇంటికి వృద్ధురాలు వస్తుండగా పక్కన ఆగి ఉన్న ట్రాక్టరకు తగిలి కింద పడింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు తల రోడ్డుకు బలంగా తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్ఐ మాచినేని రవి కేసు నమోదు చేసి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి ...



రాములు

బూర్గంపాడు, జూన్ 22: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మర్రికుంట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బూర్గంపాడు మండల పరిధిలోని మర్రికుంట గ్రామానికి చెందిన బొర్రా రాములు(45) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సమయంలో గ్రామంలో రోడ్డు దాటుతున్న క్రమంలో భద్రాచలం నుంచి పాల్వంచ వైపునకు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన క్షతగాత్రుడిని భద్రాచలం తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. శనివారం మృతుడు అన్నయ్య మునయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ఖమ్మం క్రైం, జూన్ 22: ఖమ్మం నగర పరిధిలో శుక్రవారం ఒకే రోజు మూడు దుకాణాల్లో దొంగతనాలు జరిగిన కేసులో నిందుతుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట జిల్లా చింతలపల్లి మండలం యర్రగుంట తండాకు చెందిన గుగులోత్ నాగరాజు శుక్రవారం అర్ధరాత్రి సమయంలో నగరంలోని మోహన్‌సాయి మోటార్స్, విజయసాయి మోటార్స్, ఏషియన్ పెయింట్స్ దుకాణాలలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం పాత బస్టాండు సమీపంలో నిందితుడుని అదుపులోకి తీసుకొని రిమాండ్‌క తరలించినట్లు సీఐ తెలిపారు.

మారాలి.. మారాలి..

జీవనశైలి



- » గతి తప్పుతున్న ఆహారపు అలవాట్లు
- » రోజు రోజుకూ పెరుగుతున్న కొలెస్ట్రాల్ బాధితులు
- » నిత్యం వ్యాయామానికి దూరంగా ఉండటం చేటే...
- » రక్తపోటు, మధుమేహం లాంటి వ్యాధులకు అవకాశం
- » వయోభేదం లేకుండా వెంటాడుతున్న ఒబేసిటీ సమస్య
- » జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 22: రక్తపోటు, మధుమేహం, హృద్రోగం వంటివి ఒకప్పుడు 40 ఏళ్ల తర్వాతే వచ్చేవి. ఇప్పుడు 30 ఏళ్ల నుంచే ప్రారంభమవుతున్నాయని వైద్యనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో 25-30 ఏళ్ల వయసుకే చాలామంది పలు రకాల ఆరోగ్య పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అధిక బరువు, కొలెస్ట్రాల్, రక్తపోటు వేధిస్తున్నాయి. చాలామందికి తమకు అధిక రక్తపోటు ఉన్న సంగతే తెలియడం లేదు. కొందరికి తెలిసినా... నియంత్రణలో పెట్టుకొనేందుకు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఇలా ఆరేడు సంవత్సరాలు నిర్లక్ష్యం చేసి, చివరికి మూత్రపిండాలు దెబ్బతినే వరకు తెచ్చుకుంటున్నారు. యువతే కాదు, బాధితుల్లో పెద్దలూ ఉన్నారు.

చికిత్స కోసం వైద్యులను ఆశ్రయిస్తున్న బాధితుల్లో ఎక్కువ మంది తిండి విషయంలో సరైన జాగ్రత్తలు పాటించడం లేదని తేలింది. సులువుగా దొరికే జంక్ ఫుడ్ మాయలో పడి యువతరం సమతుల్యమైన పోషకాహారానికి దూరమవుతోంది. రోజులో ఎక్కువ సమయం పనిచేసే వారు. ఐటీ, ఐటీ ఆధారి త ఉద్యోగులు వ్యాధిగ్రస్తుల్లో ఎక్కువగా కన్పిస్తున్నారు. అర్ధరాత్రి విందులు, ఇష్టారాజ్యంగా చిరుతిళ్లు చాలామందిలో బరువు పెరగటానికి కారణంగా చెప్పవచ్చు. ఒత్తిడి ఉండే ఉద్యోగాలూ సమస్యను మ రింత పెంచుతున్నాయి. ఇళ్లలో వంట చేసే తీరిక, ఓపిక ఉండడం లేదు. ఇలాంటి వారు చాలామంది బయట తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా కొలెస్ట్రాల్ మోతాదుకు మించుతోంది.

ఖమ్మం జిల్లాలో...	
రక్తపోటు బాధితులు:	20,567
గుండెజబ్బులు బాధితులు:	520
బీపీ ఉన్నవారు :	63,514
మధుమేహం బాధితులు:	44,201
వివిధ రకాల క్యాన్సర్లు ఉన్నవారు:	2680

జాతీయ పోష కాహార సంస్థ (ఎన్ఐఎన్) సర్వే ప్రకారం కొన్ని కుటుంబాలు వారంలో మూడు సార్లు హోటళ్లు, రెస్టారెంట్లకు వెళ్లి తింటున్నారు. ఇందువల్ల శరీరంలోకి అవసరానికి మించి కొవ్వు చేరుతోంది. ఆరోగ్యవంతమైన జీవనానికి సమతుల్యమైన పోషకాహారం తప్పక తీసుకోవాలని న్యూట్రీషియన్లు చెపుతున్నారు. రోజూ తినే ఆహారంలో 400 గ్రాములు కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. పీచు ఎక్కువ ఉండే పదార్థాలు మేలని సూచిస్తున్నారు. మూడేళ్ల నుంచే పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లను చేయడం వలన ప్రధానంగా అధిక బరువు సమస్యను అధిగమించ వచ్చని చెబుతున్నారు.

ఒత్తిడిని తగ్గించుకోవాలి...

● సీతారాం, కార్డియాలజీ విభాగం అధిపతి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఖమ్మం



గుండెజబ్బులు ఎక్కువగా ఉండటానికి అనేక కారణాలున్నాయి. ప్రధానంగా ప్రజల జీవన శైలిలో మార్పు రావడం. నూనె పదార్థాలు, స్వీట్లు ఎక్కువగా తినడం, సరైన వ్యాయామం చేయకపోవడం, పొగతాగడం, మద్యపానం సేవనం, వేళాపాళా లేని భోజన అలవాట్లు, అధిక బరువు గుండెజబ్బులకు దారి తీస్తోంది. దీనికి తోడు అధిక ఒత్తిడి. ఆర్థికపరమైన, జీవనశైలి ఇలాంటి పరిస్థితుల్లో గుండెపై ప్రభావం పడుతోంది. ప్రతి రోజు కనీసం 40 నిమిషాల నడక అవసరం, నృత్యం లాంటివి ఒక గంట చేసినా శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. ఇటీవలి కాలంలో యువతీయువకులు ఫాస్ట్ ఫుడ్స్ పై మోజు, ట్రాన్స్‌ఫ్యాటీ యాసిడ్స్ శరీరంలో పెరిగిపోయి హృద్రోగ సమస్యల బారిన పడుతున్నారు. ఊబకాయం, మధుమేహంతో గుండెజబ్బులకు కారణం అవుతోంది. ప్రతి రోజు కొంత సమయం సైక్లింగ్ వాకింగ్ స్విమ్మింగ్ లాంటివి చేస్తే గుండె సంబంధిత వ్యాధులు దరిచేరే ఆస్కారం ఉండదు.

కేలరీల లెక్క.....

జాతీయ పోషకాహార సంస్థ వెల్లడించిన ప్రకారం వివిధ ఆహార పదార్థాల్లో కేలరీలో ఈ విధంగా వున్నాయి.. అన్నం కప్పు 170, పుల్కా ఒకటి 80, పూరి ఒకటి 100, రొట్టె రెండు 170, ఉప్మా కప్పు 270, ఇడ్లీ రెండు 150, బజ్జీ పకోడి 8 ముక్కలు 280, మసాలా వడ రెండు 150, సమోసా ఒకటి 200, బర్ఫీ రెండు ముక్కలు 400, ఐస్‌క్రీం అరకప్పు 200, బర్గర్ ఒకటి 260, పిజ్జా ఒకటి 250, హల్వా కేసరి అరకప్పులో 320 కేలరీలు ఉంటాయి.

వ్యాయామం లేకనే...

జీవన క్రియ సక్రమంగా కొనసాగాలంటే రోజూ పెద్దలకు 2500 కిలో కేలరీల శక్తి అవసరం. ప్రస్తుతం చాలామంది తమకు తెలియకుండానే ఆహారం ద్వారా అంతకు ఎక్కువగా తీసుకుంటున్నారు. రోజూ గంటపాటు వ్యాయామం చేస్తే... ఇలా తీసుకున్న అదనపు కేలరీలు బయటకు పోతాయి. లేకుంటే శరీరంలో పేరుకుపోయి... చివరికి బరువు పెరగటం, ఊబకాయం ఏర్పడుతున్నాయి. మధుమేహం, రక్తపోటు, గుండె సమస్యలు, కొన్ని రకాల కేన్సర్లు, కీళ్ల నొప్పులు తదితర సమస్యలకు ప్రధాన హేతువు అధిక బరువే. ఉండాల్సిన దానికన్నా కిలోబరువు ఎక్కువగా ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా ముందే మేలుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వారంలో కనీసం అయిదు రోజులు వ్యాయామం చేయాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. 45 నిమిషాలు రోజూ నడిస్తే (బ్రిస్క్‌వాక్) చాలాభాగం జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఉండే వీలుందని వైద్యులు సూచిస్తున్నారు. జంక్ ఫుడ్, పొగతాగటం, మద్యపానానికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

తినడంపై ఉన్న శ్రద్ధ.. కేలరీల ఖర్చుపై లేదు...

● డాక్టర్ ఎన్.రాంప్రసాద్, ఫిజీషియన్, ఖమ్మం



తినడంలో ఉన్న మజా ఇచ్చేయడంలో ఉండడం లేదు. అదేనండి శరీరానికి కాస్త శ్రమ కలిగించడం ద్వారా పేరుకుపోయిన కొవ్వులను కరిగించడమన్న మాట. దీనిపై దృష్టిసారించక రోజువారీ తీసుకునే కేలరీలు పెరిగిపోతున్నాయి. నగరాలలో అనేక మంది కూర్చొని చేసే విధుల్లోనే ఎనిమిది నుంచి తొమ్మిది గంటలు గడుపుతున్నారు.. వీరిలో ప్రతి పదిమందిలో ఏడుగురు తమ కాలనీ చివరి వరకు కూడా నడవకపోవడం వల్ల అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. తీసుకునే ఆహారానికి అనుగుణంగా తగినంత శారీరక శ్రమ ఉండేలా చూసుకుంటే సమస్యలు తలెత్తవు. నడక, వ్యాయామం, తమ పనులు తాము స్వయంగా చేసుకోవడం వంటి వాటి ద్వారా కొవ్వు పెరగకుండా చూసుకోవచ్చు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో

భద్రాద్రి జిల్లా విద్యార్థుల ప్రతిభ

» జాతీయ స్థాయి పోటీలకు మూడు ప్రాజెక్టుల ఎంపిక



భవ్య శ్రీ



హర్షిత

కొత్తగూడెం/దుమ్ముగూడెం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఈవో ఎం. వెంకటేశ్వరచారి, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్. చలపతిరాజులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థుల ప్రాజెక్టుల వివరాలు విడుదల చేశారని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి మొత్తం 25 ప్రాజెక్టులు ఎంపిక కాగా, వీటిలో మూడు ప్రాజెక్టులు ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచే ఎంపికై అగ్రస్థానంలో నిలిచింద ని తెలిపారు. త్రివేణి పాఠశాల భద్రాచలం విద్యార్థిని పి. భవ్యశ్రీ రూపొందించిన సీడ్‌సోయింగ్‌మిషన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. గైడ్ టీచర్‌గా నాగలక్ష్మి వ్యవహరించారు. ఆశ్రమ పాఠశాల రేగుబల్లి-1 విద్యార్థిని మచ్చా మాధవి రూపొందించిన ఇకోఫ్రండ్లీ ఆర్గానిక్ బనానా ఫైబర్ అనే ప్రాజెక్టు ఎంపికైంది. గైడ్ టీచర్‌గా కే. శ్రీదేవి వ్యవహరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అశ్వాపురం విద్యార్థిని కే. హర్షిత రూపొందించిన స్పిన్ సపోర్టర్ జాకెట్ అనే ప్రాజెక్టు ఎంపికైంది. గైడటీచర్‌గా బి. రాంచంద్రు, చింత సాగర్ వ్యవహరించారని తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, గైడ్ టీచర్స్‌ను జిల్లా గణంకాల విభాగం ఇన్‌చార్జి శ్రీనివాస్, పరీక్షల విభాగం ఇన్‌చార్జి ఎస్. మాధవరావు, తదితరులు అభినందించారు.



విద్యార్థిని మాధవిని అభినందిస్తున్న హెచ్ఎం నాగమణి

బెంగళూరులో సత్తుపల్లి యువకుడు మృతి

సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి వెళ్లి కానరాని లోకాలకు

సత్తుపల్లిరూరల్, జూన్22: బెంగళూరులో జరిగిన రైలు ప్రమాదంలో సత్తుపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఒకరు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి పట్టణంలోని జవహర్ నగర్‌కు చెందిన ఆముదాల అబ్రహాం కుమారుడు ప్రకాష్ (22) బీటెక్ చదివాడు. 15రోజుల క్రితం బెంగళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరాడు. ఈ క్రమంలో శుక్రవారంరాత్రి రైలు పట్టాలపై శవమై కనిపించాడు. స్నేహితులు తల్లీదండ్రులకు సమాచారం ఇవ్వడంతో బెంగళూరు వెళ్లారు. తండ్రి అబ్రహాం ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసుల అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

బ్యాంక్ లాకరులో నగలు మాయం

సత్తుపల్లిరూరల్,జూన్22:ఓప్రైవేటు బ్యాంక్‌కు చెందిన ఖాతాదారుడి లాకర్‌లో బంగారు నగలు మాయమయ్యాయి. స్థానిక తోట వెంకటరావు వీధికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి సర్దార్ షరీఫ్ కుమార్తె ఎండీ.ఫరాజ్ హైదరాబాద్‌లో ఉంటున్నారు. సత్తుపల్లిలోని ఓ ప్రధాన బ్యాంక్‌లో 11ఏళ్లుగా లాకర్ సౌకర్యం పొందుతున్నారు. గతేడాది ఆగస్ట్‌లో రూ.9.50లక్షల విలువైన 4గాజులు, నల్లపూజల తాడు, 14ఉంగరాలు, ఒక నెక్లెస్‌తో పాటు కొన్ని వెండి వస్తువులను భద్రపరిచారు. అయితే ఈనెల 19న బక్రీద్ సందర్భంగా ఇంటికి వచ్చిన ఫరాజ్ బ్యాంక్‌కు వెళ్లిన లాకర్‌ను చూడగా వెండి వస్తువులు మినహా 15తులాల బంగారపు ఆభరణాలు కనిపించలేదు. దీంతో సత్తుపల్లి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ టీ.కిరణ్‌ను వివరణ కోరగా విచారణ చేస్తున్నామని తెలిపారు.

గుడుంబా తయారీ అనుమానితులపై బైండోవర్ కేసులు

చంద్రుగొండ, జూన్ 22: గుడుంబా తయారీకి ప్రయత్నస్తున్నారనే సమాచారంతో ముగ్గురిపై శనివారం ముందస్తు కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ రమేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సుంకర బంజర్, టేకుల బంజర్ గ్రామాల్లోని ముగ్గురు వ్యక్తులు గుడుంబా తయారీకి వినియోగించే నల్లబెల్లం, పటిక నిల్వ చేశారు. ఈ సమాచారం అందడంతో వారి నివాసాల్లో సోదాలు నిర్వహించామని, ఈ సోదాల్లో నిషేధిత బెల్లం, పటిక లభించాయని తెలిపారు. గుడుంబా తయారీకి ప్రయత్నిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసి చంద్రుగొండ తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట హాజరు పరిచినట్లు ఎక్సైజ్ ఎస్ఐ తెలిపారు.

20కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలం, జూన్ 22: భద్రాచలంలో శనివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా 20 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం కలిమెల నుంచి హైదరాబాద్‌కు వాహనంలో తరలిస్తున్న రూ.5 లక్షలు విలువ చేసే గంజాయిని సీఐ రహమున్నీసాబేగం పట్టుకొని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

భూవివాదంలో

వ్యక్తి ఆత్మహత్యపై విచారణ

కొణిజర్ల, జూన్22: మండలంలోని మేకాలకుంట గ్రామంలో భూవివాదంతో గ్రామానికి చెందిన భూక్యా సక్రియా అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిందే. ఈ కేసు విషయానికి సంబంధించి వైరా సీఐ సాగర్ శనివారం కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడించారు.. భూమి విషయంలో భూక్యా సక్రియాకు, కానిగట్టు భూమికి చెందిన సత్యనారాయణకు వివాదం జరుగుతుందని తెలిపారు. సత్యనారాయణ భూమిని కృష్ణ అనే వ్యక్తి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. భూ వివాదంతో తమల్ని ఇబ్బందులు పెడుతున్నారని, ఈ క్రమంలోనే తమ తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుమారులు ఫిర్యాదు చేశారన్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి కారకులుగా సత్యనారాయణ కుమారుడు అజయ్, కౌలుదారుడు కృష్ణ, బుజ్జి, మదన్, మల్లయ్యలు కారణమని ఐయిదుగురు పేర్లతో ఫిర్యాదు చేశారని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కరకగూడెం, జూన్ 22: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పద్మాపురం పంచాయితీ మొగిలితోగు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. శనివారం కరకగూడెం ఇన్‌చార్జ్ ఎస్ఐ వెంకటప్పయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అరెం శోభన్ (36) శుక్రవారం కుటుంబ కలహాల కారణంగా మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుం బ సభ్యులు హుటాహుటిన భద్రాచలం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం మృతుడు శోభన్ మొదటి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


మనస్తాపంతో యువకుడు...

బూర్గంపాడు, జూన్ 22: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మోరంపల్లిబంజర గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన బర్ల హేమంత్(22) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మృతుడు తల్లి శాంత వారపుసంతకు వెళ్లి వచ్చే సమయానికి ఇంట్లో ఉరేసుకుని మృతి చెంది ఉన్నట్లు తెలిపారు. మృతుడు తండ్రి ప్రమాదంలో మృతి చెందడంతో మనస్తాపంతో మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. మృతుడు అన్నయ్య వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమపేరుతో బ్లాక్‌మెయిల్

» మాయమాటలతో బాలికను ఆగ్రాకు తీసుకెళ్లిన యువకుడు » నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ఖమ్మం క్రైం, జూన్ 22: ఖమ్మం నగరంలో ఓ యువకుడు పదో తరగతి విద్యార్థినిని మాయమాటలతో బెదిరించి ఆగ్రాకు తీసుకెళ్లిన ఘటనపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పట్టణంలోని తుమ్మలగడ్డకు చెందిన సాయి అనే యువకుడు గతంలో తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినికి ఆటలు నేర్పిస్తానని వల వేసి, ఆ తరువాత మాయమాటలతో బెదిరించి ఆగ్రాకు తీసుకెళ్లడంతో విద్యార్థిని బంధువుల ఫిర్యాదుమేరకు పోలీసులు సద రు యువకుడిని అరెస్టు చేసి ఫోక్సో కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సాయి అనే యువకుడు గతంలో నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి చదు వు మానేశాడు. అయితే అతడికి క్రీడల్లో కొంత ప్రావీణ్యత ఉండడంతో దాన్ని అవకాశంగా తీసుకుని తాను చదివిన పాఠశాలలో ఆటలు నేర్పుతూ విద్యార్థులకు దగ్గరయ్యాడు. ఈ క్రమంలో ఆ పాఠశాలలో ప్రస్తుతం 10వ తరగతి చదువుతు న్న 15 ఏళ్ల విద్యార్థినిని ప్రేమిస్తున్నాని మాయమాటలు చెప్పి వలలో వేసుకునే ప్రయత్నం చేశాడు. అయితే అతడి ప్రవర్తన తెలుసుకుని సదరు విద్యార్థిని తన కుటుంబ సభ్యులకు విష యం చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు ఆ యువకుడికి కౌన్సెలింగ్ నిర్వహించి మరో సారి ఇలాంటివి చేయవద్దని వార్నింగ్ ఇచ్చారు. అయినా అతడు తన తీరు మార్చుకోకుండా ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో మెసెజ్‌లు చేస్తూ బెదిరించసాగాడు. వారం రోజుల క్రితం సదరు బాలికకు మెసేజ్ చేసి ఇంటి నుంచి బయటకు రావాలని లే దంటే చచ్చిపోతానని బెదిరించాడు. దాంతో బయటకు వచ్చిన విద్యార్థినని భయపెట్టి రైలులో ఆగ్రాకు తీసుకెళ్లాడు. తమ కుమార్తె ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టి సదరు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు.



జిల్లాలో ఎరువులు, విత్తన నిల్వలు సరిపడా ఉన్నాయి



సత్తుపల్లిరూరల్, జూన్22: జిల్లా వ్యాప్తంగా రైతుల వ్యవసాయ అవసరాలకు సరిపడా ఎరువులు, విత్తన నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా కూడా కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. శనివారం ఆమె సత్తుపల్లిలో పర్యటించి పలు విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ నిర్వహించారు.అనంతరం మండలంలోని తాళ్లమడ, నారాయణపురం గ్రామాల్లో ప్రభుత్వం అందించిన జీలుగు పంటలను పరిశీలించారు. వివిధ అంశాలపై రైతులతో మాట్లాడారు. ఆమె వెంట ఏవో వై.శ్రీనివాసరావు, ఉద్యానవన అధికారి వేణు, ఏఈవోలు కే.ఆశాజ్యోతి, టీ.నరేష్, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

- ప్రతీ హామీని అమలుపరుస్తాం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలెం, జూన్22: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, వారి సంక్షేమానికి ఎన్ని కోట్లయినా ఖర్చుచేయడానికి సిద్ధంగా ఉందని రెవెన్యూ గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బచ్చోడు, హస్నాబాద్, సుబ్లేడు, మేడిదపల్లి, తదితర గ్రామాల్లో పర్యటించారు. బచ్చోడులో కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను అందించారు. గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని, దీంతో అనేకమంది ఇబ్బందులకు గురయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా నష్టపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు నిశ్చయంతో ఉందన్నారు. రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. పాలేరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగు, తాగునీటితో పాటు విద్యా, వైద్యం రహదారుల సౌకర్యం



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కలిపించి ఆదర్శ నియోజకవర్గంగా తయారు చేస్తాన న్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతీ గ్రామంలో సీసీరోడ్లు, అంతర్గత రహదారులు నిర్మిస్తా మన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో గణేష్, ఎంపీపీ బోడ మంగిలాల్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో శేషాద్రి, ఏవో సీతారాంరెడ్డి, జడ్పీటీసీ బెల్లం శ్రీను, నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి చావా శివరామకృష్ణ, ఆర్. అరవందరెడ్డి, హరితారెడ్డి, భరత్‌చంద్ర, బీరెడ్డి చంద్రారెడ్డి, జయపాల్‌రెడ్డి, భరత్‌చంద్ర, శ్రీనివాసరెడ్డి, ఓర వెంకటేశ్వర్లు, రంగా, పాల్గొన్నారు.

రూరల్ మండలంలో నేడు పొంగులేటి పర్యటన

ఖమ్మంరూరల్: రెవెన్యూ, గృహ నిర్మాణశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలంలోని నాయుడుపేట, ఆరెంపుల, కైకొండాయిగూడెం, రామన్నపేట, దానవాయిగూడెం, తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించనున్నారు. నాయుడుపేటలో శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు నాయుడుపేట గ్రామానికి వచ్చి స్వీకరించాలని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

- ఎమ్మెల్యే మట్టా రాగమయి హర్షం

సత్తుపల్లి,జూన్22: మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన రూ.2లక్షల రైతు రుణమాఫీపై క్యాబినెట్ ఆమోదంపై సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్ సభలో మాటా ఇవ్వగా ప్రకటించిన అన్ని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. విధివిధానాల ప్రకారం ఆగస్టు 15లోగా రుణమాఫీ ఏకకాలంలోనే ప్రభుత్వం చేస్తుందని, ఇందుకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ సత్తుపల్లి నియోజక వర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా స్థానిక సాయిబాబా ఆలయం నుంచి షిర్డీకి బయల్దేరిన 126మంది బాబా భక్తుల ప్రయాణాన్ని జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక గుడిపాడు సమీపంలోని పోడు భూముల సమస్యలపై ఎమ్మెల్యేను గిరిజనులు కలిసి విన్నవించగా అధికారులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని 5మండలాల పంచాయితీ సెక్రటరీలు కలిసి తమ సమస్యలను వివరించగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, చల్లగుళ్ల నరసింహారావు, కొత్తూరు ప్రభాకరరావు, గాదె చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం కోటపాడులో కిషాన్ సెల్ జిల్లా శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచి బాతుల రమణసుధాకర్ ఆధ్వర్యంలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రైతు డిక్లరేషన్‌లో భాగంగా రైతు రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

వేంసూరు: మర్లపాడులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సోమిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు వెల్ది జగన్మోహన్‌రావు, ఎండీ.ఫైజుద్దీన్, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, అట్లూరి సత్యనారాయణరెడ్డి, ఎర్రా సత్యనారాయణ, మేడా వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, కుక్కపల్లి శ్రీనివాసరావు, వంట్ల రమేష్, చంటి, వేల్పుల బుచ్చాలు, భీమిరెడ్డి చెన్నకేశవరెడ్డి, నాగులు, సురేష్, కుక్కపల్లి రామకృష్ణ, మోరంపూడి వెంకటేశ్వరరావు, కుక్కపల్లి సత్యనారాయణ, వేణు, భీమిరెడ్డి చెన్నకేశవరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కల్లూరు: అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఒకే దఫాలో రూ.2లక్షల రైతురుణమాఫీ ప్రకటించటం అబినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్‌కే యాఖుబ్‌అలీ, బాగం ప్రభాకరచౌదరి, బైర్ల కాంతరావు, లక్కినేని రమేష్, ఎస్‌కే ఉస్మాన్, మచ్చా వెంకటేశ్వరరావు, ఎం విజయరావు, మట్టా రామకృష్ణ పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి



మర్లపాడులో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఉత్తమ బోధన అందించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి

ముదిగొండ, జూన్ 22: విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం ముదిగొండ మండలం మాధాపురం, మేడేపల్లి జడ్పీఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయికి ధీటుగా విద్యాబోధన చేయాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందాయని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

తిరుమలాయపాలెం:ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. శనివారం తిరుమలాయపాలెంలో ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల వివరాలు తెలుసుకుని వారిని పాఠశాలల్లో వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామీణ ప్రాంత వసతి గృహాల్లో అడ్మిషన్లు పెంచాలి

- ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్22: పట్టణ ప్రాంతాల్లోని సాంఘీక సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల అడ్మిషన్లు ఆశాజనకంగా ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లోని అడ్మిషన్లు జరగటం లేదని డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ సంక్షేమాధికారులను హెచ్చరించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జల్లేపల్లి, గోకినేపల్లి, వల్లభీ, రామన్న పాలేం, వేంసూరు, ముచ్చర్ల సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు అడ్మిషన్లు ఎందుకు పెరగటం లేదని సంక్షేమాధికారులను ప్రశ్నించారు. నిబంధనల మేరకు విద్యార్థుల తల్లి,దండ్రులతో పేరంట్స్ కమిటీ సమా వేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఏఎస్‌డబ్ల్యూ ఆర్ రాజు, శ్రీలత, పీ.లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కస్తాల

ఆసుపత్రి పనులను వేగవంతం చేయాలి: జడ్పీ సీఈవో

ఎర్రుపాలెం జూన్22: మండలంలోని బనిగండ్లపాడులో నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వాసుపత్రి భవన నిర్మాణ పనులను జిల్లా పరిషత్ సీఈవో వినోద్ కుమార్ శనివారం పరిశీలించారు. నిర్మాణపనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తవ్వాల్సి ఉండగా ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు సంతృప్తిగా ఉన్నా, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచిం చారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరిండెంట్ వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి బుచ్చన్న యాదవ్, కాంట్రాక్టర్ అనుమోలు వెంకట కృష్ణారావు, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా త్రివేణి పాఠశాల ఆవిర్భావ వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి,జూన్22: నగరంలోని త్రివేణి పాఠశాల ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. త్రివేణి విద్యాసంస్థల 31 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో విజయాలు సొంతం చేసుకుందని త్రివేణి, కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో త్రివేణి పాఠశాల ఒక ప్రత్యేకతను నిలుపుకోని అగ్రస్థానంలో నిలిచిందని పాఠశాల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి తెలిపారు. 1994 జూన్ 23న నూట ముప్పై మంది విద్యార్థులతో ఆరుగురు ఉపాధ్యాయులతో ప్రారంభమై నేడు 12వేలకు పైగా విద్యార్థులు, 15 బ్రాంచ్‌లు, 24 క్యాంపస్‌లతో 1000కి పైగా సిబ్బందితో జాతీయ, రాష్ట్ర స్థాయిలలో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తోందన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, స్వప్న, ముస్తాఫా, శ్రీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వరరావు

నీటిపారుదలశాఖ ఉద్యోగుల హాజరు పరిశీలన

కల్లూరు, జూన్22 కల్లూరులోని ప్రధాన జలవనరులశాఖ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు సమయం పాటించకుండా ఇష్టారాజ్యంగా విధులకు హజరవుతుండటంపై ఉన్నతాధికారి చర్యలు తీసుకున్నారు. దీనిపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో జలవనరుల శాఖ కార్యాలయంలో ఇష్టారాజ్యంగా విధులు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు స్పందించారు. ఈ మేరకు తమ కార్యాలయాల్లో పర్యవేక్షణ చేస్తున్న ఇంజనీరింగ్ అధికారి ఒకరు ఉద్యోగులందరికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యాలయం పరిధిలో ఉద్యోగలు హాజరు పట్టికను క్షుణంగా పరిశీలించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఉద్యోగులందరని సమావేశపరిచారు. విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారని తెలిసింది. కార్యాలయం పని వేళ్లల్లో సకాలంలో విధులకు అందరు హాజరు కావాలని సూచించారు. ఇకపై నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. ఏదైన అత్యవసరం పని ఉంటే తమకు సమాచారం అందిస్తూ సెలవు పెట్టాలని ఉద్యోగులను సదరు ఇంజనీరింగ్ అధికారి కోరారు. ఇదే ప్రకారం శనివారం ఉదయం అధికారులు, ఉద్యోగలందరూ సమయానుకూలంగా విధులకు హాజరయ్యారు.

పాఠశాలలను సందర్శించిన విద్యార్థి సంఘాల నేతలు

ఖమ్మంరూరల్,జూన్22: సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు రామకృష్ణ, ప్రవీణ్, మస్తాన్ ఆరోపించారు.ఖమ్మంరూరల్ మండలం, మద్దుల పల్లి పరిధిలోని సోషల్‌వెల్ఫేర్ గురుకుల కళాశాలను శనివారం సందర్శించారు. కళాశాలలో మూడు రోజులుగా విద్యార్థినులు వాంతులు, విరోచ నాలు అవుతున్నా సిబ్బంది పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

సమాజ గమనాన్ని మార్చేది మార్క్సిజం

ముదిగొండ, జూన్22: అసమానతలు లేని సమసమాజం కోసం కుల మత రహిత సమాజ సాధన మార్క్సిజం వల్లనే సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర నాయకుడు మన్నేపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. ముదిగొండలోని మచ్చా వీరయ్య భవన్‌లో రెండు రోజులపాటు జరుగనున్న మండలస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

ముదిగొండ,జూన్22: మండలపరిషత్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జడ్పీటీసీ పసుపులేటి దుర్గ పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 27మంది లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మంకెన దామోదర్, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఆర్ఐ వహీదా పాల్గొన్నారు.

కేంద్రమంత్రి సంజయ్‌ను కలిసిన గల్లా

ఖమ్మంబైపాస్‌రోడ్, జూన్22: కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లోని తన నివాసంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ శనివారం కలిశారు. హోంశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో శాలువాతో సత్కరించారు. త్వరలో జిల్లాలో పర్యటన చేయాలని విజ్ఞప్తి చేశామని త్వరలో జిల్లాకు వస్తానని సంజయ్ తెలిపినట్లు పేర్కొన్నారు. సుగ్గుల వెంకటగుప్తా ఆయన వెంట ఉన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులను సరిచేయాలి

కొణిజర్ల,జూన్22:ప్రజాపాలనలో సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజలు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుల తప్పులను అధికారులే సరిచేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ కోరారు. ఈ మేరకు సీపీఐ, రైతుసంఘం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, రైతుసంఘం నాయకులు స్వర్ణ రమేష్, తోటపల్లి సీతరాములు, తండు సోమయ్య, చింతనిప్పు చలపతిరావు, అడపా వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, శంకర్‌రావు, సురేష్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనకు దరఖాస్తుచేసుకోండి

ఖమ్మంవ్యవసాయం,జూన్22: జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో సభ్యులు బీమాకోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు ఆధార్‌కార్డు, బ్యాంక్‌అకౌంట్, ప్రవేశపుస్తకంలో సభ్యునిపేరు నమోదు చేయబడిన పేజీల జిరాక్సులు, జిల్లా మత్స్యశాఖ అధికారికి దరఖాస్తు చేయాలని ప్రకటనలో కోరారు. మూడురోజుల్లోగా వివరాలను జిల్లా కార్యాలయంలో అందించాలని కోరారు.

బాలల సదనం సందర్శన

ఖమ్మంలీగల్,జూన్22:జిల్లాప్రధాన సీనియర్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కె.వి.చంద్రశేఖర్‌రావు శనివారం సాయంత్రం బాలల సదనాన్ని సందర్శించారు. రాజ్యాంగము మరియు న్యాయ సేవ సంస్థల చట్టాలను వివరించారు. రాజ్యాంగము నిర్దేశించిన ప్రాథమిక విధులను ప్రతీ ఒక్కరూ పాటించినట్లయితే అందరికీ అదే రాజ్యాంగము నిర్దేశించిన ప్రాథమిక హక్కులు అమలైతాయన్నారు. చదువుకునే వయస్సులో బాలలు విద్య పట్లనే దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సదనం సూపరింటెండెంట్ వరలక్ష్మీ, అధ్యాపకులు పాల్గొన్నారు.



కోదండ రామాలయంలో స్వర్ణోత్సవం ప్రారంభం

సత్తుపల్లిరూరల్, జూన్22: సత్తుపల్లి శ్రీకోదండ రామాలయంలో 50వ వార్షికోత్సవం వేడుకలు శనివారం ప్రారంభమైనాయి. మంగళ వాయిద్యాల నడుమ మామిడితోరణాలు కట్టగా వైఖానస ఆగమోక్త ప్రకారం అర్చకులు గోవర్ధనం ఆంజనేయ చార్యులు పర్యవేక్షణలో కార్యక్రమాలు సాగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, దీక్షాచరణ పంచగవ్యారాధన, ప్రాశన, గోపూజ, మూలవిరాట్‌లకు అభిషేకం, పుట్టమట్టి సేకరణ, అంకురార్పణ, వాస్తుపూజ వాస్తుహోమం, పుష్పయాగం చేశారు. కాగా నేడు శ్రీ సీతారామ కల్యాణం, శ్రీ శ్రీదేవి భూదేవి సహిత శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు శ్రీకోదండ రామాలయ ట్రస్ట్ బాధ్యులు కొత్తూరు సత్యనారాయణ, అనుమోలు సురేష్ తెలిపారు.

30న నాపాట పంచామృతం

ఖమ్మంసాంస్కృతికం,జూన్22: మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఈనెల30వతేదీ సాయంత్రం 6గంటలకు ఖమ్మంభక్త రామదాసు కళాక్షేత్రంలో నాపాట పంచామృతం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మొగిలి గుణకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దివంగత గాయకుడు ఎస్పీ బాల సుబ్రమణ్యం 78వ జయంతి సందర్భంగా ఆయన పాడిన తెలుగు హిట్ గీతాలను ప్రముఖ గాయకులు ఆలపిస్తారని చెప్పారు.

వివాహానికి ఆర్థికసాయం

ఖమ్మంసాంస్కృతికం జూన్ 22: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగురాలి పెళ్లి ఖర్చులకు రూ. 10వేలు అందజేశారు. కమాన్ బజార్‌లో టీదుకాణం నిర్వహించే వ్యక్తి కుమార్తె పెళ్లి ఖర్చులకోసం నగదును అందజేశారు. కార్యక్రమలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి.కృష్ణారెడ్డి, కార్యదర్శి వేముల హనుమంత రావు, జోన్ చైర్మన్ డీసీసీ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వైరా, జూన్22: వైరాటౌన్-1ప్రాంతంలో ఆదివారం మూడుగంటలసేపు కరెంట్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ ఎస్ఎస్ఎస్.కుమార్ తెలిపారు. బ్రాహ్మణపల్లి, మధిర రోడ్డు, రాజశేఖర్‌నగర్, ఇందిరమ్మ కాలనీ, గాంధీచౌక్, మధువిద్యాలయం, ఎంపీ డీవో కార్యాలయం, స్వతంబజార్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

టార్పాలిన్ పట్టాల వితరణ

వైరా,జూన్ 22: వైరా గ్రేట్ విజన్‌క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మీ ఆధ్వర్యంలో సూర్యదేవర శ్రీధర్ జన్మ దినాన్ని పురస్కరించుకొని ఇద్దరు రైతులకు టార్పాలిన్ పట్టాలను శనివారం అందజేశారు. మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన నల్లమోతు రవి, శిరీష అనే రైతులకు ఈ పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో లగడపాటి ప్రభాకర్‌రావు, ఉండ్రు శ్యాంబాబు, మిట్టపల్లి నాగి, గంగవరపు కిషన్, రామకృష్ణ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

తల్లాడ,జూన్22: మండల పరిధిలోని అన్నారుగూడెం జడ్పీఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మాదినేని నర్సింహారావుతో పాటు మరో ఐదుగురు ఉపాధ్యాయులను శనివారం హైస్కూల్‌లో సన్మానించారు. ఇటీవల వారు బదిలీ కావటంతో ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానించారు.

క్రీడా పాఠశాలకు ఎంపికలు

ఏన్కూరు, జూన్22: గురుకుల పాఠశాల ఆవరణలో మండలస్థాయి క్రీడా పాఠశాలల ఎంపికలు జరిగాయి. హకీంపేట క్రీడా పాఠశాలలో 5వతరగతిలో ప్రవేశానికి టెస్టులను నిర్వహించారు. 20 మంది బాలబాలికలను ఎంపిక ఏశారు. వీరు ఈనెల 27న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ బాదావత్ రవి, దాసరి రమేష్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

మధిరరూరల్, జూన్ 22: బోడేపూడి వైద్యసేవసమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. బోడేపూడి భవన్‌లో ఈ శిబిరాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రారంభించారు. ప్రముఖ వైద్యనిపుణులు చెరువుపల్లి ప్రసాద్, షరీఫ్, కంటి వైద్యులు, ఉచిత బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో శీలం నర్సింహారావు, మండవ ఫణీంద్రకుమారి, మందా సైదులు, రామనర్సయ్య, తేలప్రోలు రాధాకృష్ణ, మురళీ పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

ఖమ్మంసాంస్కృతికం,జూన్22:చనిపోయిన తండ్రికి తలకొరివి పెట్టిందో కూతురు.. నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడేనికి చెందిన గుడిపెల్లి నాగేశ్వరరావు శనివారం మృతి చెందాడు. మార్బుల్ పనిచేసే నాగేశ్వరరావుకు ముగ్గురు కూతుర్లే ఉన్నారు. దీంతో పదవతరగతి చదువుతున్న పెద్దకుమార్తె ఉష తలకొరివి పెట్టింది.

మురుగు కాల్వల పూడికతీత పనులు వేగంగా పూర్తి చేయాలి

- మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సంపత్ కుమార్

ఖమ్మంసాంస్కృతికం,జూన్22: మురుగు కాల్వల పూడిక తీత పనులను మరింత వేగంగా పూర్తి చేయాలని మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సంపత్ కుమార్ పారిశుధ్య అధికారులు సిబ్బందిని ఆదేశించారు. శనివారం తన ఛాంబర్‌లో నిర్వహించిన శానిటేషన్ రివ్యూ మీటింగ్‌లో అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా మురుగు కాల్వల పూడిత తీత పనులు నత్తనడకన సాగుతుండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు పడుతుండటం వల్ల మురుగు కాల్వల్లో పేరుకున్న చెత్తా చెదారం తొలగించి మురుగునీటి పారుదలకు అవరోధం లేకుండా చూడాలన్నారు. పారిశుధ్య సిబ్బంది విధులకు హాజరవుతున్నారా విధులు నిర్వహిస్తున్నారో లేదో స్పెషల్ ఆఫీసర్లు తనిఖీ చేయాలన్నారు. అవసరమైన చోట జేసీబీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్లపై కొబ్బరి బోండాలు, పండ్లు విక్రయించేవారు వ్యర్థాలను సైడ్ కాల్వల్లో వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. పనులను పర్యవేక్షించని వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో స్పెషల్ ఆఫీసర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, జవానుల తదితరులు పాల్గొన్నారు.

దంపతులకు పలువురి నివాళి

వైరా, జూన్ 22: వైరా మునిసిపాలిటీ రెండోవార్డులోని హనుమాన్‌బజార్‌లో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో మృతిచెందిన పల్లపు ఆంజనేయులు, నర్సమ్మ దంపతుల భౌతికకాయాలకు శనివారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ సహా పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంజనేయులు, నర్సమ్మ హఠాన్మరణంతో హనుమాన్‌బజార్‌లో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి. ఎంతో కలివిడిగా ఉండే దంపతులను విద్యుత్ రూపంలోని మృత్యువు కబళించటాన్ని అక్కడి ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు పల్లపు కొండలు, పుచ్చకాయల వీరభద్రం, పొదిల హరినాథ్, పమ్మి అశోక్, బోళ్ల గంగారావు, బండారు తిరుపతిరావు, నాగరాజు, ధార్న రాజశేఖర్, అప్పం సురేష్, పణితి శ్రీను తదితరులు నివాళులర్పించారు. అలాగే మండలంలోని లింగన్నపాలెంలో తోటకూర సత్యనారాయణ దశదిన కర్మకాండల్లో జిల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకటనర్సిరెడ్డి, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, చింతనిప్పు మాధవరావు, చంగల పరశురాం, గుగులోతు రాము, తేళ్లూరి వీరయ్య, వన్నపరపు కొండలు, తోటకూర జగ్గయ్య తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న బొర్రా రాజశేఖర్

గ్రామకంఠ భూమికి అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి

వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా

వైరా,జూన్22:వైరామునిసిపాలిటీ పరిధిలోని కొణిజర్ల మండలం దిద్దుపూడి రెవెన్యూ గ్రామంలోని గ్రామకంఠ భూమిని కొందరు అక్రమంగా చేయించుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయాలని ఆ గ్రామానికి చెందిన కొంతమంది బాధితులు శనివారం వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. మక్కళ వెంకమ్మ, రమణ, చల్లా కేశమ్మ, తిరుపతమ్మ, మక్కల లక్ష్మీ తదితరులు మాట్లాడుతూ దిద్దుపూడి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంతంలో నివాసముంటున్నామన్నారు. సర్వేనెంబర్ 23,73లోని ఇళ్ల స్థలాలను కొంతమంది అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ స్థలాలు లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షాల సమ యంలో నీళ్లు వచ్చి ఇబ్బందులకు గురవుతున్నందున తాత్కాలికంగా మెరక ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇదే అదునుగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని వాటిని రద్దుచేసి న్యాయం చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు.